


"దండాలు బాబూ!" అన్నాడు ముత్యాలు అత్యంత భయభక్తులతో తలగుడ్డను తీసి చంకలో ఉంచుకుంటూ, చేతులు జోడించి.

ముచ్చటగా 'స్వీకరించాం' అన్నట్లు తల పంకించాడు ముసి ముసి నవ్వులతో మీసం మీద చేత్తో, డఫేదారు వెంకటాద్రి.

ఇలా ముత్యాలు దండాలు బాబూ అనడం, అలా ముచ్చటగా, ముసిముసి నవ్వులతో మీసంమీద చేత్తో వెంకటాద్రి 'స్వీకరించాం' అన్నట్లు తల పంకించడం, మూడ్నెల్లనుండీ జరుగుతున్నతంతే ఐతే, ఈ మూడ్రోజుల లేటెస్ట్ సిరీస్‌లో, మూడో రోజున, ఇలా అనడం, అలా స్వీకరించడం ఇది ముప్పై మూడోసారి

పదినిముషాల సినిమా అయిన తర్వాత గాని టైటిల్స్ వెయ్యకపోవడం లాంటి కొత్త సినీ టెక్నిక్‌లా, స్థలం–సందర్భం–సమయాల గురించి కించిత్ ప్రస్తావన కూడా లేకుండా కథ ప్రారంభించినా, పాత్రల పరిచయం తప్పదు గనక, ఇక్కడ ముత్యాలు గురించీ, డఫేదార్ వెంకటాద్రి గురించీ, వీళ్ళిద్దరికీ ఉన్న సంబంధ బాంధవ్యాల సరళి గురించీ కొంచెం చెప్పుకోవాలి.

ముత్యాలు యువకుడు కాదు. మునగాల మున్సఫూ కాడు. జనగాం జమీందారు అంతకంటే కాడు. మరిదేదీ కాక 'ముత్యాలెవరూ?' అన్న ప్రశ్నకు సమాధానం–"ఫాదరాఫ్ లేట్ సోల్జర్ సిమ్మాచలం". గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు ముత్యాలు 'ఫలానా' అని చెప్పేందుకు రిఫరెన్స్‌గా 'సోల్జర్ సిమ్మాచలం తండ్రి' అన్చెప్పడం ఏమంత సబబుగా అన్పించక పోయినా, అంతకంటే మరో మార్గంలేదు మరి. ఎందుకంటే, ముత్యాలు కంటే, ముత్యాలు కొడుకు సిమ్మాచలం ఎక్కువ ఖ్యాతి గడించాడు కీర్తిశేషుడై. క్లుప్తంగా చెప్పాలంటే, 'గుడిసె'నుండి పారిపోయిన సిమ్మాచలం మిలటరీలో చేరి, సోల్జర్ సిమ్మాచలంగా మారి, ఆనక మూడేళ్ళ క్రితం 'వార్‌ఫ్రంట్'లో మరణించి లేట్ సోల్జర్ సిమ్మాచలంగా మిగిలిపోయాడు చరిత్ర పుటల్లో (అలాగని, ఆ పుటల్లో సిమ్మాచలం పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడి ఉండాలన్న రూలేం లేదు.)

యుద్ధం ఆయిపోయింది అర్ధరాత్రికి. రాత్రే ఆలిండియా రేడియోని 'పాంచముఖం'తో నిద్రలేపి, ప్రసిడెంటూ ప్రైమ్మినిష్టరూ, డిఫెన్సు మినిష్టరూ వగైరాలందరూ నేషన్‌ను ఎడ్రెస్ చేశారు విజయ చిహ్నంగా దేశం దేశం పండుగ జరుపుకున్నారు, పబ్లికాఫీసులకు శెలవు ప్రకటించారు. రెండో రోజుకు యుద్ధంలో మరణించిన వారి సంఖ్య, వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు స్టాటిస్టిక్స్ తయారయ్యాయి. ఖచ్చితంగా ఎంతమంది చని పోయారో లెఖ్కలు తేలక పోయినా (తప్పులేదు సుమండీ!....ఎంచేతంటే—ఎవరు, ఎక్కడ, ఏ కొండలోయల్లో! ఏ కీకారణ్యాల్లో చచ్చిపోయారో కనిపెట్టడం ఆ బ్రహ్మకైనా తరం కాదే....ఇక!....) మొత్తం మీద ఓ పది అటూ ఇటుగా "ఇదుగో ఇంత మందీ....ఇరుగో వీళ్లూ" అని తేల్చారు. మూడో రోజున దేశమంతా, మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు గాను వెలిబుచ్చిన 'మౌర్నింగ్'లో ప్రాణాలర్పించినందుగ్గాను 'రాజ్ ఘాట్'లో చోటులేక పోయినా, ఊరికి ఓ పది మైళ్ళదూరంలో—అందరితోబాటు సిమ్మాచలం పేరు కూడా చెక్కించి, ఉదారంగా ఓ 'టూంబ్'ను ప్రతిష్టించింది పాపం ప్రభుత్వం.


సిమ్మాచలం వీరమరణం చెందాడన్న వార్త మూడ్నెల్లగ్గాని తెలియలేదు ముత్యా

ఖకు. అతడు చేసిన దేశసేవగ్గాను. గుడిసె నుండి పారిపోయిన్రోజు సిమ్మాచలం తొడుక్కున్న పందల పాక ఖద్దరు చొక్కానూ, ఒక నీరు కావి పంచెనూ, కొన్ని చిరుగుల చేర్పులతో బహుమతిగా పంపింది ప్రభుత్వం ముత్యాలుకు. ఈ బహుమతులివ్వడం అంతటితో ఆగితే, ఈ మూడ్నెల్లనుండీ "దండాలు బాబూ!" అంటూ ముత్యాలు దఫేదారు వెంకటాద్రి (దేవుడికంటే ముందు పూజారి ప్రసన్నత సంపాదించుకోవాలి మరి) చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండకపోను. అలాగే 'స్వీకరించామంటూ' ముసి ముసి నవ్వులతో ...గ్రా....తల పంకించే అవకాశం దఫేదారు వెంకటాద్రికీ కలగక పోను.

చిక్కంతా, నాలుగు నెలలక్రితం ఒచ్చిపోయిన జనరల్ ఎలక్షన్లతో మొదలైంది ఎలక్షన్లు మరో నెల్రోజులున్నాయనగా, అకస్మాత్తుగా ఇటు ప్రభుత్వానికీ, అటు నాయకులకూ మూడేళ్ళక్రితం యుద్ధంలో మరణించిన క్షతగాత్రులు గుర్తుకువచ్చారు. (ఏ ప్రతిపక్ష పార్టీల కాకిగోలలాంటి నతాయింపుల్లేకుండానే). కారే రాజుల్... రాజ్యముల్ గలుగవే!...." అన్న సామెత కొద్దీ పోయినవాళ్ళు పోయినా, పాపం— వాళ్ళ తాలూకూ "ఇంకా" మిగిలి ఉన్న కుటుంబాల సంగతేమిటని బోల్డు జాలి పడ్డారు. ఏవిటి దారని గుండెలు బాదుకోవడాలూ....చర్చలూ....మంతనాలూ.... మంత్రాంగాల ఫలితంగా "యుద్ధంలో ప్రాణాలర్పించిన" ఒక్కొక్క వీరుని కుటుంబానికి (యింకా మిగిలి ఉన్న) 300 రూపాయల నగదు బహుమానం" (నష్టపరిహారం. పైగా సోల్జరే కదండీ మరీ!....హిజ్ లైఫ్ డజంట్ కాస్టమోర్ దేన్ దట్....) అన్న రిజల్యూషన్ పాసైంది. ఈ వార్తను ప్రెస్ద్వారానూ, ఆకాశవాణి ద్వారానే కాకుండా సాక్షాత్తు నాయకాగ్రగణ్యులే (అఫ్ కోర్స్.... ఎలక్షన్లలో పోటీ చేస్తున్న వారే నను కోండి) ఎడంచేత్తో చనిపోయినవారి లిస్టూ వారి తాలూకు కుటుంబాల వివరాలూ, కుడిచేత్తో అభయముద్రతో ప్రజల మధ్యకు మోసుకు వచ్చారు. ఇందుకు ప్రతిఫలంగా, అందరితోబాటు ముత్యాలూ, తన ఓటే కాకుండా, పక్షవాతంతో తీసుకుంటున్న తన పెళ్ళానిదీ, తాడుతెగి తన దగ్గరే ఉన్న కూతురుదీ–ఇలా ఆ మాంబాపతులన్నీ కలిపి మొత్తం మీద ఓ ఐదారు వేయించ గలిగాడు ఉడతా భక్తిగా.

ఎలక్షన్లు అయిపోయాయి....ఎలుకలు మళ్ళీ ఎప్పటి మాదిరిగానే కలుగుల్లోకి దూరిపోయాయ్ భద్రంగా.

ఇదుగో—ఇక్కడ్నుండీ అసలు కథ ప్రారంభం. ఉన్న ఒక్క కొడుకూ ఆఖరకు కంటితో చూసుకునేందుక్కూడా అవకాశం లేకుండా అర్థాంతరపు చావు చచ్చినందుకు కుళ్ళి కుళ్ళి ఏడ్చినా, ముసలితనంలో పని చేయలేక, తప్పక ఏ కొంచెం




చేయగలిగినా, ఎవరూ పనివ్వకా, కుటుంబాన్ని ఈడ్చలేక పోతున్న క్లిష్ట సమయంలో 'సిమ్మాచలం చావు బహుమానం' వల్ల ముత్యాలుకు కొంచెం సంతోషమే కలిగింది.

ముందుగా "ఈ ఫలానా ముత్యాలు, యుద్ధంలో మరణించిన ఫలానా సిమ్మాచలం తండ్రే" అన్న ఋజువు పత్రం కోసం, కరణంగారింట్లో, ఎఱ్ఱని ఏగాణీ డబ్బు తీసుకోకుండా కూతురుని పాచిపనికి కుదిర్చాడు ముత్యాలు. ఆ ఋజువు పత్రంతో మూడేళ్ళ నాడు తాలూకాఫీసుకు చేరిన చేరడం-ఈ మూడేళ్ళ నుండీ ఇలా రావడం-పోవడం క్రమం తప్పకుండా జరుగుతూనే ఉంది. ఉన్న ఊరు గనక కరణంగారి ముడుపైతే, ఏదో విధంగా చెల్లించుకో గలిగాడు కాని, ఇక్కడిలా ఉంటుందనుకోలేదు ముత్యాలు. మొట్టమొదటగా తాశీల్దారుగారి డఫేదారు వెంకటాద్రే ఈ వాతావరణపు లాలుకొలూ,లుకలుకలూ తెలియ జెప్పాల్సి వచ్చింది ముత్యాలుకు. మొత్తానికెలాగైతేనేం ఎప్పుడో రానున్న ఆ చావు బహుమానం కోసం-ముడుపు చెల్లించుకునేందుకై యీ మూడేళ్లనుండి పస్తులూ, పరగడపులూ మరి కొంచెం ఎక్కువగా అలవాటు చేసుకోక తప్పలేదు ముత్యాలు కుటుంబానికి

అదీ చాలకపోవడంతో, ఆ రానున్న "బహుమానం'లోనే అంతస్థుకు తగ్గట్టుగా దఫేదారు వెంకటాద్రి మొదలుకుని, ఎల్. డీ. సీ అప్పారావుకీ, ఎకౌంటెంట్ ఏకాంబరానికీ, హెడ్‌క్లార్క్ శేషావతారానికీ–ఇలా ఆ విషయంలో సంబంధించిన వారందరికీ బహుమానాల రూపంలో షేర్లు వేసి, అలాగని 'ప్రామిస్' చెయ్యక తప్ప లేదు ముత్యాలుకు. కనకనే, ముత్యాలు పెట్టుకున్న అర్జీ కాగితాలు ఒక చిన్న ముద్రతో దఫేదారు వెంకటాద్రి డెస్క్ నుండి బయలుదేరి, నెలకో స్టేజ్ చొ॥న హెడ్ క్లర్క్ శేషావతారంగారి టేబిల్ వరకు మాత్రమే నడవగలిగాయ్.

* * *

ముప్పైమూడోసారి, ముసిముసి నవ్వుతో, మీసంమీద చేత్తో, దఫేదారు వెంకటాద్రి ముత్యాలు పెట్టిన దణ్ణాలను స్వీకరించామన్నట్లు తలపంకించినా, ఆనక కొంచెం చిరాకుతో.

"ఏటి ముత్యాలూ: నన్నేటి సెయ్యమంటావ్ సెప్పు? నా సేతిలో ఉన్నపని–అదే–ముద్ర–మూడ్నెల్లనాడే గుద్దీసినానా! అయ్యగారు కొంత 'బిసీ'గా ఉన్నారని సెప్తినా లేదా?? సీ....సీ....ఇట్టా ఇసిగిస్తే లాబమేటి?" అన్నాడు చిటపటలాడుతూ.

పువ్వేసిన ఎడమకన్ను ఎమురెంతకు మర్రుమంటున్నా, జోడించిన చేతుల్ని తీసే ధైర్యం లేక "బాబ్బాబు....సచ్చి నీ కడుపున పుడతా? నీ తండ్రిలాటోడ్ని .... రచ్చిచ్చు బాబూ!" అన్నాడు దీనంగా.

"సరి సర్లే....ఇంతకీ కాఫీ తాగినవా?" అన్నాడు వెంకటాద్రి. అలా అన్నాడూ అంటే "నేను కాఫీ తాగలేదు మరి....!" అని అర్థం వెంకటాద్రి పరిభాషలో. అసలు వెంకటాద్రికే కాకుండా, ఆ ఆఫీస్‌లో పన్చేస్తున్న వెంకటాద్రి మొదలు – అయ్‌గారివరకూ అందరికీ తలా ఒక పరిభాషా ఉంది. ఆ భాషలన్నిటికీ అప్పటికే అలవాటుపడిన ముత్యాలు, నిన్న మధ్యాహ్నం ఎప్పుడో ఏదో కాస్త తినగా మిగిలిన పదిపైసలనూ భద్రంగా, బాధగా, మౌనంగా పైపంచ ముడి విప్పదీసి, వెంకటాద్రి చేతిలో ఉంచాడు. వెంకటాద్రి ముఖంలో ఇందాకటి చిరాకు లేకపోయినా, అసంతృప్తి మాత్రం తొలగ లేదు ఆ పది పైసల నాణెంతో.

"ఏటో....! ముసిలోడివని సాయం సేద్దావని నేననుకుంటంటే....సరి సర్లే.... నువ్విడ్నే ఉండు. ఓ చణంలో వచ్చేత్తా" నంటూ టీ కొట్టువైపు వెళ్ళిపోయాడు.

గుండెల్లోనుంచి ఎగిసివచ్చే ఆకలినీ, ఆయాసాన్నీ అదిమిపెట్టేందుకు, బరువుగా నిట్టూర్చడం తప్ప మరేం చేయలేక, ఎడమకన్నుని చేత్తో కప్పుకుని వరండాలో ఉసూరుమంటూ కూలబడ్డాడు ముత్యాలు.

ఓ ఐదునిముషాల తర్వాత వెంకటాద్రి రావడం–హెడ్–క్లర్క్ శేషావతారంగారి

చెవుల్లో ఏదో మంత్రం ఊది, అర్జీకాగితా లను తీసుకుని అయ్‌గారి గ ది లో కి వెళ్ళడం, మరో పావుగంట తర్వాత, మళ్లీ నేరుగా ముత్యాలు కూర్చున్న చోటుకి రావడం—అంతా వెంట వెంటనే జరిగి పోయింది. ఈ హడావిడంతా చూస్తున్న ముత్యాలుకు, నేటితో తన కష్టాలు తీరినట్లే అన్పించి, కొంచెం తేలిగ్గా నిట్టూర్చాడు.

"ఇదుగో ముత్యాలూ....మాట....!" అంటూ కొంచెం గోడవారగా తీసుకు వెళ్ళి, "సూడు ముత్యాలూ! నా సేతిలో పనైతే ఇమీడీట్‌గా సేసేసేవాడ్ని. కాని, అయ్‌గారు సాలా సిటపటలాడిపోతన్నారు. నీ పని ఇయ్యాలే అయిపోవాలంటే.... అయ్‌గారికో అయిదు పదులు!" (యాభై అని కాకుండా అలా ఎన్ని పదులూ, అంటే ఐదే అని తేలిగ్గా సమాధానం చెప్పగలిగేట్టుగా ఉండాలి గనక అలా చెప్పడం మంచిదని, అయ్‌గారు ఈ ఆఫీస్‌లో కొత్తగా అడుగుపెట్టిన మూడో రోజే పాఠం నేర్చుకున్నాడు వెంకటాద్రి)

ముత్యాలు పని 'అయోమయం – జరా మయం' అయింది. "ఇప్పుడేటి సెయ్యడం? అంతసొమ్ము ఎలా తేవడం?" అన్న ఆలోచనలతో,

"సూడు బాబూ!" అని ఏదో నచ్చ చెప్పేలోగానే, "లాబంలేదు ముత్యాలూ! అదిలేందే పనవదు....అపలు నాకు తెలవ కడుగుతానూ! యిత్తుల్లేకుండా మొక్క లెట్టా పుడతయ్యయ్యా?" అని కాసేపాగి మళ్లీ, "అసలు నీ బాదేటి? అన్నిత్తు ల్లెవ్వనేనా? పర్వాలేదు....నేసెప్తాగా... ఆ బహుమానం వచ్చాక అందులోనుండే తవరుకూడా తీసుకుని, ఈసారికి కాయండి అయ్‌గారూ! అని అయ్‌గార్కి నేనచ్చ సెపుతాన్లే!" అన్నాడు చిర్నవ్వు నవ్వుతూ ఇక్కడొక తిరకాసుంది. అంటే పై పరి భాష—పాపం—వెంకటాద్రి సొంతానిదికాదు— అది అయ్‌గారి పరిభాష అంటే, అలా భక్తుల విషయంలో "శాస్తంతకరుణగా జూపమని నేను దేవరవారికి రికమెండ్ చేస్తాన్లే' అని భక్తులకు నచ్చచెప్పమని వెంకటాద్రికి చెప్పడం – అడపాదడపా – సమయం–సందర్భాలనుబట్టి, ఆ పరిభాష లోని కర్త, కర్మ, క్రియలను మారుస్తూ

---

○ "ఇదిగో! నిన్నే! శ్రీమతీ!" శ్రీవారి పిలుపు.

"ఏం శ్రీవారూ?"

"పతివ్రతలేం తింటారో తెలుసా!"

"అబ్బే తెలవదు! ఏం తింటారండీ?"

"నేననుకున్నాలే నీకు తెలవదని!"

ఉండటం—అయ్యగారి పరిభాష. ఆ సంగతి వెంకట్రాదికి తెలుసుగాని పాపం—ముత్యాలి కింకా తెలియదు.

"నిండా మునిగినవాడికి చలేవిటని, ఇంతదాకా వచ్చాక, చేసేదేంలేక "దొరి కింది దక్కడు- పోయిందిపొల్లు- ఉన్నదే గట్టి" అన్న వేదాంతధోరణిలో మౌనంగా తలాడించాడు ముత్యాలు.

వెంటనే డఫేదార్ వెంకట్రాద్రి రాకెట్ లా అయ్యగారి ఆఫీసులోకి దూసుకు వెళ్ళి ఓ కాగితాన్ని పట్టుకువచ్చి ముత్యాలు చేత నిశాని వేయించాడు.

మరో ఐదు నిమిషాల్లో ఎక్నాలెంట్-కమ్-టెంపరరీ కాషియరయిన ఏకాంబరంగారి దగ్గరికి, అయ్యగారి పెద్ద ముద్ర పడిన కాగితాలు వెళ్ళడమూ- ఆ డబ్బుచ్చుకుని వెంకట్రాద్రి అయ్యగారి గదిలో దూరడమూ జరిగిపోయింది. పెద్ద కర్మనాడే పిండాకూడన్నట్లు ఆలస్యంచేస్తే ఎక్కడ చెయ్యిమించిపోతుందో అనే బయంతో ఎక్నాలెంట్ ఏకాంబరం, ఎల్. డి. సి అప్పారావు! హెడ్ క్లర్క్ శేషావతారంతోసహా అందరూ ఎవరికి వారే ఆతృతగా, ఆశగా, ముత్యాలు కూర్చున్నచోటికి వచ్చారు. శేషావతారం వస్తూనే "ఏవోయ్... ముత్యాలూ— బావున్నావా? నీ అర్జీని అర్జంటుగా పట్టి కెళ్ళి దొరగారి సంతకం చేయించి! సీల్ వేయించి పట్టుకు రమ్మని వెంకట్రాద్రితో. పంపానోయ్...." ఈపాటికి అయిపోయి వుంటుందనుకో. మరి నా..." శేషావతారంగారు పూర్తిగా మాట్లాడలేక ముందే ఎక్నాలెంట్ ఏకాంబరం—

"నువ్వేనటోయ్ ముత్యాలూ ..! నీ కొడుకు చావు తాలూకూడబ్బును ఇప్పుడే వెంకట్రాద్రి ద్వారా పంపానోయ్. ఇంకా అవలేదేమిటి. !" అంటూ నాన్పుడు వ్యవహారం మొదలుపెట్టాడు. ఇంతలో ఎల్. డి. సీ అప్పారావు ఆఫీసులోనుండి ఓ స్టూలు పట్టుకువచ్చి "ఇదిగో! ఇక్కడ కూర్చో ముత్యాలూ! మరీ నీరసంగా వున్నావు సుమా!" అంటూ ఆప్యాయత ఒలకబోశాడు.

ముత్యాలు మాత్రం ఇవేమీ పట్టనట్లు రాబోయే సొమ్ముగురించీ, అందులో వీరందరికీ ఇవ్వాల్సిన దిగదుడుపులెంతా అని ఏవేవో లెక్కలు వేసుకుంటున్నాడు తనలో తాను,

ఇంతలో ఆఫీసులోనుండి అయ్యగారు హడావిడిగా బయటపడి, ఆంగాదుగా జీపులో ఎక్కి కూర్చున్నాడు. రామునితో కపివరుడులాగా, అంతకన్నా ఆత్రంగా అర్జంటుగా వెనక డఫేదారు వెంకట్రాద్రి పరుగుతీశాడు. ఇదంతా చూస్తున్న ముత్యాలు గుండెల్లో రాయి పడింది, ఇక వెంకట్రాద్రితో లాభంలేదనుకుని, డ్రైవర్ కోసం అసహనంగా ఎదురు చూస్తూ, కోపంతో పొగలూ, సెగలూ కక్కుతున్న

అయ్‌గారి దగ్గరకు వెళ్లాడు. బక్కచిక్కిన దేహం, పువ్వేసిన కన్నూ, చొక్కా లేని కారణంగా లెక్కించేందుకు అనువుగా కన బడుతున్న పక్కటెముకలూ, మూడొం తుల జీవితపు బరువు మోసి ఒంగిపోయిన నడుమూ— ఈ ఆకారాన్ని చూసి అయ్ గారి కోపం తారామండలానికి అంటింది. "వెంకటాద్రీ— హు ఈస్ దిస్ బెగ్గర్. అసలిక్కడికెందుకు రానిచ్చావ్ .." అని విరుచుకుపడ్డాడు. ఈ హఠాత్పరిణామానికి వెంకటాద్రి ముందుకొంచెం అవాక్కయినా, మరుక్షణం తెలివి తెచ్చుకుని ముత్యాలు రెక్కపుచ్చుకుని ఓ పదిగజాలు దూరంగా లాక్కుపోయాడు.

"బాబూ పొద్దోయింది. తవరూ. అయ్‌గారూ మళ్లా ఎప్పుడొస్తారో ఏమో! ఆ మిగిలిన సొమ్ము " అంతకంటే సూటిగా అడిగే ధైర్యం లేకపోయింది ఆ పరిస్థితుల్లో ముత్యాలుకు.

"ఏటెహె సుద్దిన సుప్వాకడివి. అయ్‌గారి రెండో కూతురిగారికి ఆస్పి టల్లో అర్జింట్‌గా ఆపరేషన్ జరుగుతున్నది. వచ్చేనెల వస్తున రా పో !" అంటూ పరుగున వెళ్ళి జీపు ఎక్కడం, ముత్యాలు ముఖంనిండా దుమ్ము రేపుతూ జీపూ, జీపుతోబాటుగా అయ్‌గారూ, అయ్‌గార్నంటుకుని డఫేదారు వెంకటాద్రి వెళ్ళిపోవడమూ సెకండ్లమీద జరిగిపోయింది.

స్థాణువైపోయాడు ముత్యాలు. "మళ్ళీ మొదటి తారీకా? ఈ పదేన్రోజులూ ఎట్టా గడపడం? ఏటి సెయ్యడం?" ఆలోచనల్తోటు, నిన్నటినుండీ తిండిలేక పోవడంతో, కళ్ళుతిరిగి, అలాగే దుమ్ము నేల మీదికి ఒరిగిపోయాడు ముత్యాలు– ఫాదర్ ఆఫ్ ద బిలవెడ్ సన్నాఫ్ మదరిండియా అండ్ లేట్ సోల్జర్ సిమ్మాచలం. పాపం తనకు డబ్బు ముట్టినట్లుగా తనచేత నిశాని వేయించుకున్నారనీ, తహశీల్‌దారుగారి రెండో అమ్మాయికి నాలుగో కాన్పుసందర్భంగా, అర్జెంట్‌గా ఆపరేషన్ చేయాల్సి రావడమూ, సమయానికి అయ్యగారిదగ్గర డబ్బులేకపోవడం, అందుకు తన కొడుకు 'చావు బహుమానం'ఉపయోగపడుతోందనీ ముత్యాలుకేం తెలుసు? పువ్వేసిన కంటి నుండి ఒక కన్నీటిచుక్క రాలి.దుమ్ములో ఇంకిపోవడం వరండాలోని ముగ్గురుప్రేక్షకుల కళ్ళబడ్డా, చూడనట్లు మామూలుగా అతి మామూలుగా వెళ్ళిపోయారు ఎవరికి వారే ..

